సాక్షి
వికారాబాద్

బుధవారం, 1, జనవరి, 2025



పారిశ్రామిక వాడకు భూ సర్వే

లగచర్ల ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఫార్మాసిటీకి బదులుగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంకల్పించింది.

8లో▸



ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రత్యేక అధికారి ఉషశ్రీ అన్నారు.

8లో▸



పకడ్బందీగా నిర్వహించాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే, నమోదు ప్రక్రియన పకడ్బందీగా నిర్వహించాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు.

9లో▸

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డికి 'నూతన' శుభాకాంక్షలు



కొండాపేట: సీఎం రేవంత్‌రెడిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మల్లురవి, సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: పీఆర్టీయూ టీఎస్ వికారాబాద్ మండల శాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పీఆర్టీయూ జిల్లా ముఖ్య నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, రాష్ట్ర నాయకులు వీరేశం, గోపాల్, వెంకట్‌రెడ్డి, బాబ్యానాయక్, రాజశేఖర్, అశోక్, వికారాబాద్ మండల అధ్యక్షుడు కేధార్‌నాథ్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

అనంతగిరి: ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి ప్రిన్సిపాళ్లు కృషి చేయాలన్నారు. విద్యార్థులు పరీక్ష ఒత్తిడిని అధిగమించేలా మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బ్యాక్‌లాగ్ స్టూడెంట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రూపాలక్ష్మి, నర్సింహారెడ్డి, సురేశ్వరస్వామి, బుచ్చిరెడ్డి, కుమారస్వామి, వెంకటేశ్వరరావు, నర్సింలు, మూసాఖాన్, బస్వరాజు, ముజీబ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల ఆధారిత జనగణనతోనే సామాజిక న్యాయం



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోవింద్ నాయక్ తదితరులు

అనంతగిరి: కుల ఆధారిత జనగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దేశంలో సగభాగం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, నాయకులు గట్యానాయక్, రవీందర్ నాయక్, బాబ్యానాయక్, సూర్య నాయక్, అరుణ్ నాయక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టౌన్: పట్టణంలోని ఓ బేకరీలో కేకుల కోసం వచ్చిన జనం



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో..



సరికొత్త ఆశలతో..

నూతన సంవత్సరంలోకి అడుగు

- 2024కు వీడ్కోలు.. 2025కు ఘన స్వాగతం
- జిల్లా ప్రజలకు స్పీకర్, కలెక్టర్, ఎస్పీ నూతన సంవత్సర శుభాకాంక్షలు



ధారూరులో 2025 ఆకారంలో కూర్చొని కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

వికారాబాద్: కొత్త సంవత్సరాన్ని సరికొత్తగా ప్రారంభించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. 2024కు వీడ్కోలు పలికి 2025 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ఏడాది మొదటి రోజు దైవ దర్శనం చేసుకుంటే అంతా మేలు జరుగుతుందనే భావన ప్రజల్లో ఉండటంతో ఆ దిశగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే యువకులు రోడ్లపైకి వచ్చి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొట్టారు. రాత్రి 2 గంటల వరకు సంబరాల్లో మునిగిపోయారు. పలు చోట్ల బాణసంచా కాల్చి, మిఠాయిలు, కేక్‌లు పంచిపెట్టారు. ఫోన్ల ద్వారా మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. రాత్రి 6గంటల నుంచే బేకరీలు, కేక్ దుకాణాలు జనంతో కళకళలాడాయి. వైన్ షాపులు మందుబాబులతో సందడిగా కనిపించాయి. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు రాత్రంతా గస్తీ నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

నూతన సంవత్సరం నేపథ్యంలో ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో నిర్వాహకులు అందుకుతగ్గ ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అనంతగిరి అనంత పద్మనాభస్వామి ఆలయం, బుగ్గరామేశ్వర ఆలయం, పీరంపల్లి పరమేశ్వరగుట్ట, దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయం, కుల్కచర్ల మండలంలోని పాంబండ ఆలయం, దోమలోని మైలారం వేంకటేశ్వర ఆలయం, పరిగిలోని వేంకటేశ్వర ఆలయం, నర్సింహ్మ స్వామి, శివాలయం, పరిగి మండలంలోని లొంకహనుమాన్ దేవాలయం, కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం, తాండూరు పరిధిలోని భూకైలాస్, నీల్లపల్లి శివాలయం, నవాబుపేట మండలంలోని ఎల్లకొండ శివాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.. గడిచిన ఏడాదిలో జిల్లాతో పాటు వికారాబాద్ నియోజకవర్గంలో ఎప్పుడూ లేనంత అభివృద్ధి పనులు జరిగాయి. ఆరు గ్యారంటీలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేశాం. అభివృద్ధికి జిల్లా ప్రజలు సహకరించాలి.

– ప్రసాద్‌కుమార్, స్పీకర్

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తాం



ముందుగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నాం. ప్రభుత్వ ప్రాధమ్యాలే మా ప్రాధాన్యతగా తీసుకొని పని చేస్తాం. ప్రజాపాలన, అభయహస్తం కార్యక్రమాల్లో భాగంగా ఆరు గ్యారంటీలను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోంది. వీటిని ప్రజలకు చేరేలా చూస్తాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. పాలనా పరంగా, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తాం. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు..



జిల్లా ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు. ప్రధానంగా ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు సాగుతాం. చట్టాన్ని గౌరవించే వారిని పోలీసులు తప్పకుండా గౌరవిస్తారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం. జిల్లాలో ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటి నివారణకు అవగాహణ కార్యక్రమాలు నిర్వహిస్తాం. పోలీసులకు ప్రజలు సహకరించాలి.

– నారాయణరెడ్డి, ఎస్పీ

4,230 కేసులు

2024లో నమోదైనవి

- ఫిర్యాదుల నమోదులో పారదర్శకత పాటించాం
- గత ఏడాదితో పోలిస్తే నేరాల సంఖ్య పెరిగింది
- వార్షిక క్రైం నివేదికను వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి



వార్షిక క్రైమ్ నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్: 'జిల్లాలో 2023తో పోలిస్తే 2024లో నేరాల సంఖ్య పెరిగింది.. ప్రధాన నేరాలు తగ్గడం ఊరటనిస్తోంది'.. అని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గత ఏడాది నమోదైన కేసుల వివరాలు వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, నిఘా వ్యవస్థలు సమర్థవంతంగా పని చేశాయని తెలిపారు. అవగాహన కార్యక్రమాలు, హాట్ స్పాట్ల గుర్తింపు, సత్వరం స్పందించడంతో ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గిందన్నారు. గుట్కా క్రమ విక్రయాలు, రేషన్ బియ్యం స్మగ్లింగ్, ఇసుక దందాపై ప్రత్యేక దృష్టి సారించడంతో అధిక సంఖ్యలో కేసులు నమోదయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి 889 ఫిర్యాదులు అందగా వీటిని పరిశీలించి 304 కేసులు నమోదు చేశామన్నారు. సైబర్ మోసాల బారిన పడి ప్రజలు రూ.4.34 కోట్లు పోగొట్టుకున్నారని వెల్లడించారు. రూ.29.60 లక్షలు రీకవరి చేశామన్నారు. జిల్లాలో 3,015 హాట్‌స్పాట్లు గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డయల్ 100కు అత్యధికంగా 29,775 ఫిర్యాదులు వచ్చాయని.. 1,356 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. అట్రాసిటీ కేసులు కూడా పెరిగాయని పేర్కొన్నారు. లగచర్ల ఘటనలో 71 మందిని గుర్తించి 37 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 500 సీసీ కెమెరాలు కొత్తగా ఏర్పాటు చేయించామన్నారు. ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ కార్యక్రమాల ద్వారా 335మంది బాలకార్మికులకు విముక్తి కల్పించినట్లు చెప్పారు. దొంగతనం కేసుల్లో 54 శాతం రికవరీ చేశామని తెలిపారు. 150కి పైగా దొంగనాలు చేసిన అంతర్రాష్ట్ర దొంగను పట్టుకుని రిమాండ్ చేశామని వివరించారు. 386 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయని తెలిపారు. ఇందులో ఐదుగురికి జీవిత ఖైదు పడిందన్నారు.

అవగాహన కార్యక్రమాలతో సత్ఫలితాలు

షీ టీంల పర్యవేక్షణ, కళాజాత అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా కల్తీ విత్తనాలు, కారం పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, కలప, ఇసుక రవాణా తదితర ముఠాలను కట్టడి చేయగలిగామని స్పష్టం చేశారు.

క్రైమ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో..

క్రైమ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం ద్వారా కీలక కేసులు పరిశోధనకు దోహదం చేసిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని వర్గాల సహకారంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఏడాది క్రితమే లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవటంతో సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. కొత్త సంవత్సరంలో కూడా పక్కా ప్రణాళికతో నేరాల అదుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హన్మంతరావ్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు ఇలా..

ఘటనలు	2023లో..	2024లో..
హత్యలు	30	25
రాబరీలు	03	02
పగటి దొంగతనాలు	07	14
రాత్రి దొంగతనాలు	69	93
దొంగతనాలు	119	174
కిడ్నాప్‌లు	60	72
ప్రమాదాలు	326	351
మోసాలు	127	301
లైంగిక దాడులు	55	64
హత్యాయత్నం కేసులు	33	37
ఇతర కేసులు	2,771	3,098



మహా పడిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దంపతులు

వైభవంగా మహా పడిపూజ

తాండూరు: అయ్యప్ప స్వామి దయతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులు, మాలధారులతో కలిసి మహా పడిపూజ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయ్యప్ప కీర్తనలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కన్నెస్వాముల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో తాండూరు నియోజవకర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. పూజా కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహరాజ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, ఎమ్మెల్యే సోదరులు మనోహర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, కౌన్సిలర్లు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, నాయకులు ఉత్తమ్‌చంద్, జనార్దన్‌రెడ్డి, అజయ్‌ప్రసాద్, వెంకట్‌రాంరెడ్డి, పరిమళ్ గుప్తా, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, భారతీయ వరి పరిశోధనా సంస్థ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ సుందరం
- శివారెడ్డిపల్లిలో ప్రపంచ నేలల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు పండిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, భారతీయ వరి పరిశోధనా సంస్థ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ ఆర్.ఎం.సుందరం అన్నారు. మంగళవారం దోమ మండలం శివారెడ్డిపల్లిలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రైతూ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా నేలలో ఉన్న పోషక విలువలు తెలుసుకోవచ్చని.. ఏయే పంటలు వేస్తే అధిక లాభాలు వస్తాయో తెలుస్తాయన్నారు. రైతులు పరిమితికి మించి ఎరువులు వాడుతున్నారని ఇలా చేయడం ద్వారా నేలలు దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుందన్నారు. ప్రతి రైతూ పంటలకు, నేలకు సరిపడా పోషకాలు కచ్చితంగా అందించాలన్నారు. వాటి ద్వారా వాతావరణంలో ఏర్పడే దుష్పరిణామాలను అరికట్టడమే కాకుండా భవిష్యత్ తరాలకు అనుకూలమైన పంటలను పండించడానికి వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం రైతులకు భూసార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ డీవీకే నాగేశ్వర్‌రావు, డాక్టర్ రఘువీర్‌రావు, డాక్టర్ అరవింద్‌కుమార్, డాక్టర్ పద్మకుమారి, డాక్టర్ జేసుదాసు, డాక్టర్ పి.ముతురమన్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ప్రధానకార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పరిగి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్లు పరుశురాంరెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ దోమ, గండీడ్ మండలాల అధ్యక్షులు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, కేఎం నారాయణ, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లు వచ్చేశాయ్

అంగన్‌వాడీ కేంద్రాలకు జనవరి నెల మొదటి దఫా సరఫరా



బషీరాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు సరఫరా చేస్తున్న సిబ్బంది

బషీరాబాద్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఎట్టకేలకు కోడిగుడ్లు సరఫరా అయ్యాయి.. రెండు రోజుల క్రితం సాక్షి దినపత్రికలో గుడ్డు గోవిందా ! శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం పౌల్ట్రీ కాంట్రాక్టర్ బషీరాబాద్ మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లకు గుడ్లు సరఫరా చేశారు. జనవరి నెల మొదటి బ్యాచ్ 15 రోజులకు సరపడా పంపిణీ చేశారు. గడ్ల సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐసీడీఎస్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



పూడూర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లేశ్ పటేల్ అన్నారు. మంగళవారం పూడూర్ మండల కేంద్రంలో పరిగి మా శారద ఆస్పత్రి డాక్టర్ రాజశేఖర్ సిబ్బందితో కలిసి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు.

క్లుప్తంగా

పెచ్చులూడిన తరగతి గది పరిశీలన



గది కొలతలు తీసుకుంటున్న అధికారుల బృందం

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ హరిజన్ చెర్రి పాఠశాల భవనాన్ని మంగళ వారం అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉషశ్రీ, పంచాయతీ రాజ్ శాఖ డీఈ సుదర్శన్‌రావు, ఏఈ రవికిరణ్ మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గురించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. అందుకుగాను భవనం కొలతలు తీసుకున్నామని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు మిగిలి ఉన్నాయని.. వాటితో తాత్కాలికంగా ప్లాస్టింగ్ చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నూతన భవనం మంజూరుకు అధికారులకు నివేదిస్తామన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రత్యేక అధికారి ఉషశ్రీ



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉషశ్రీ

దుద్యాల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రత్యేక అధికారి ఉషశ్రీ అన్నారు. మంగళవారం ఆమె హస్నాబాద్ హరిజనవాడలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అందించే ఆహారపదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, అంగన్వాడీ టీచర్ అనసూయ తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో లారీ డ్రైవర్‌కు జైలు

బంట్వారం: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారని కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ తెలిపారు. వివరాలు.. ఈ నెల 27న సదాశివపేట నుంచి ఓ లారీ డ్రైవర్ తాండూరు వైపు లోడింగ్ లారీతో వెళ్తున్నాడు. కోట్‌పల్లి మండలంలోని లింగంపల్లి చౌరాస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అజయ్‌యాదవ్ మద్యం సేవించి లారీ నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు అజయ్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి మంగళవారం వికారాబాద్ కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రెండు రోజుల జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

మహిళను ఏమార్చి ఏటీఎం కార్డు చోరీ

రూ.25 వేలు విత్ డ్రా

తాండూరు టౌన్: ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వచ్చిన మహిళను ఏమార్చి ఆమె ఖాతా నుంచి డబ్బు కాజేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ సంతోశ్ కుమార్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన శోభ పొదుపు సంఘంలోని తన వాటా నగదు రూ.25వేలు డ్రా చేసేందుకు స్థానిక యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్దకు వెళ్లింది. అక్కడే ఉన్న వ్యక్తికి తన కార్డు ఇచ్చి తనకు కార్డు వాడడం రాదని డ్రా చేసి ఇవ్వాలని కోరింది. దీంతో ఆ వ్యక్తి కాసేపు డ్రా చేస్తున్నట్లు నటించి నగదు రావడం లేదని ఓ పాత కార్డు ఇచ్చి అక్కడ నుంచి ఉడాయించాడు. కాసేపటికి తన ఖాతా నుంచి రూ.25వేలు నగదు ఉపసంహరించినట్లు గుర్తించి సోమవారం తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త అనుభూతులు!

2024లో కఠోరశ్రమ.. 2025లో ఫలితం

- రూ.2కోట్ల వార్షిక ఆదాయం పొందే యువకుడు
- మరెందరో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిక
- ఆనందంలో ఉద్యోగ యువత

బొంరాస్‌పేట: విద్యార్థి దశ నుంచి ఉద్యోగి కావాలని కలలు కంటాం.. కష్టపడతాం.. విజయం సాధించాక వచ్చే ఆ ఆనందం, అనుభూతి వేరు. కొత్త ఆశలు, ఆశయాలు ఎగిరి గంతేస్తాయి. అలాంటి వారే మన జిల్లాలో రూ.2కోట్ల వార్షిక ఆదాయం పొందే ఉద్యోగితోపాటు కొత్తగా ఉపాధ్యాయులు, పోలీసులు, ఆర్మీ, ఉద్యోగాల్లో చేరగానే కొత్త ఏడాదిలో పొందే అనుభూతులు, ఆనందాలను జిల్లాలోని పలువురు న్యూ ఉద్యోగులు 'సాక్షి'తో పంచుకున్నారు.



పేరెంట్ టీచర్ మీటింగ్‌లో హెచ్‌ఎం భీమేశ్

ఏడో తరగతిలోనే లక్ష్యం



ఏడో తరగతి చదువుతుండగానే ఉపాధ్యాయుడిని కావాలనుకున్నా. నా శారీరక దారుఢ్యం చూసి పోలీస్ అని పిలిచేవారు. ఎన్ని నోటిఫికేషన్లు వచ్చినా దరఖాస్తు చేయలేదు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి హెచ్‌ఎం అయ్యా. 2025 న్యూ ఇయర్‌ను ఇలాగే ఊహించా.

– భీమేశ్, యూపీఎస్ మాటూరు, దౌల్తాబాద్

నాన్నే ఆదర్శం



నాన్న సయ్యద్ యాసిన్ ఖురీషి ఆబ్కారీ శాఖకు జాయింట్ కమిషనర్. తాను చిన్నప్పటి నుంచి సొంతంగా ఎదిగారు. నాన్ననే ఆదర్శంగా తీసుకున్నా. తాజాగా అమేజాన్‌లో రూ.2కోట్ల వార్షిక ఆదాయంతో ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది.

– సయ్యద్ అర్బాజ్ ఖురేషీ, అమేజాన్ ఉద్యోగి, తుంకిమెట్ల, బొంరాస్‌పేట

2025నుంచి వేతనం



నా తల్లిదండ్రులు కిషన్ నాయక్, ఉమ్లీబాయి కలలు నెరవేర్చేందుకు కష్టపడ్డాను. ఇంటర్మీడియట్ వరకు కొడంగల్ ప్రభుత్వ పాఠశాలలో చదివా. పాలమూరు వర్సిటీలో పీజీ చేశా. ఎలాంటి కోచింగ్ లేకుండానే పోలీస్ ఉద్యోగం కోసం చదివా. జాబ్ వచ్చింది. ఆనందంగా ఉంది.

– విజయ భాస్కర్, సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్, బొంరాస్‌పేట

జవాన్ కావాలని జాగారం



గిరిజనతండాలో మాణికిబాయి, రాములునాయక్‌లకు పుట్టి ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదివా. దేశ రక్షణకు జవాన్ కావాలనుకున్నా. అందుకు రాత్రిపగలు కష్టపడి చదివా. అదే లక్ష్యంతో సీఆర్‌పీఎఫ్ పోలీస్ అయ్యాను. జనవరి 22న జాయిన్ అవుతున్నా.

– దేవేందర్, భీక్యానాయక్‌తండా, బొంరాస్‌పేట

జిల్లాలో 14వ ర్యాంకు



నాన్న రెవెన్యూ శాఖలో ఉద్యోగి. లక్ష్యంతో చదివాను. తొలిసారి (తాజా) డీఎస్సీలో జిల్లాలో 14వ ర్యాంకు సాధించా. నియామకాల్లో నా సొంతూరు కొడంగల్ తాలూకా కేంద్రంలోని పాఠశాలలో ఉద్యోగం వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. కొత్త ఏడాది కలిసొచ్చిందని ఆనందం కలుగుతోంది.

– మంజుల, ఎస్‌జీటీ, కొడంగల్

ఖాకీ యూనిఫామ్ కోసమే..



నేను పుట్టింది కర్నాటక. విద్యాభ్యాసం మాత్రం దోమ మండలం. సాధారణంగా న్యూ ఇయర్ అనగానే యువత ప్రధానంగా ఎంజాయ్‌మెంట్‌కు ప్లాన్ చేస్తారు. కాని నేను ఖాకీ యూనిఫామ్ కావాలనే చదివాను. న్యూ ఇయర్ వేడుకలను యువత గట్టి లక్ష్యంతో ప్లాన్ చేసుకుని విజయం సాధించాలి.

– మహేందర్, సివిల్ కానిస్టేబుల్, వికారాబాద్

ఒక్క మార్కుతో సాధించా



కోచింగ్ లేకుండానే చదివా. వదిన పీజీటీ గురుకుల టీచర్. నాన్న లేకపోవడంతో అన్నా వదినలు చేసిన సహకారం జీవితంలో మరువలేనిది. వీరి సహకారంతో గత డీఎస్సీలో ఒక మార్కుతో జాబ్ కోల్పోయాను. కాని ఏడాది సాధించా.

– అశోక్‌కుమార్, ముజాయిత్‌పూర్, కుల్కచర్ల మండలం

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆలయంలో ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఆలయకమిటీ సభ్యులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్



ఆలయకమిటీ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

అయూబ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చుకునేందుకు వెళ్లి..

బావిలో పడి మహిళ మృతి

దోమ: దాహార్తిని తీర్చుకునేందుకు వెళ్లిన మహిళ బావిలోపడి మృతి చెందింది. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పాలేపల్లిలో గ్రామానికి చెందిన మంగలి పద్మమ్మ(37) జీవాలను మేపేందుకు వెళ్లింది. సాయంత్రం దాహం వేడయంతో సమీపంలోని బావి వద్దకు నీరు తాగేందుకు వెళ్లడంతో కాలు జారి పడిపోయింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో



పద్మమ్మ మృతదేహం

సమీప పంటపొలాల దగ్గరకు వెతుకుతుండగా ఓ బావి గట్టుపై చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. బావిలో నీరు అధికంగా ఉండడంతో గ్రామస్తులు మోటార్ల సాయంతో నీరు బయటకు తోడగా పద్మమ్మ శవమై కనిపించింది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతురాలికి ఎనిమిదేళ్ల కూతురున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

లగచర్ల వద్ద పోలీస్ పికెటింగ్

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల గేటు సమీపంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ముందుస్తుగా అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. రోటిబండ తండా, పులిచర్లకుంట తండా, లగచర్ల గ్రామాలకు మధ్య లగచర్ల గేటు వద్ద పోలీసు సిబ్బందిని పహారా కాస్తోంది.



లగచర్ల గేట్ వద్ద పోలీసుల పహారా

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

మూడు సెల్‌ఫోన్లు, రూ.6,300 నగదు స్వాధీనం

పూడూర్: పేకాడుతున్న ఎనిమిది మందిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సోమన్‌గుర్తి శివారులో కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి నర్సింలు, యాదయ్య, సత్తయ్య, మల్లేశ్, రాములు, యాదయ్య, చెన్నయ్య, రమేశ్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.6,300 నగదు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

అనంతగిరి: రూట్ వాచ్‌లో ఉన్న వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ పోలీసులు మంగళవారం గంజాయిని సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాస్, పరిగి సీఐ నీరజ, వికారాబాద్ సీఐ రాగవీణ, ఎస్ ప్రేమ్‌కుమార్‌రెడ్డి పరిగిలోని రూప్‌ఖాన్‌పేట వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో దుద్యాలకు చెందిన నవీన్‌కుమార్ బైక్‌ను ఆపి తనిఖీ చేయగా అతని వద్ద 150గ్రాముల గంజాయి లభ్యమైంది. పోలీసులు విచారణ మేరకు హైదరాబాద్‌లోని రామంతాపూర్‌కు చెందిన ఆదిమూల మల్లేశ్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలపడంతో అక్కడకి వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మల్లేశ్ వద్ద 930 గ్రాముల గంజాయి లభ్యమైంది. వీరి పై గతంలో ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరిలో నూ కేసులున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇందిరమ్మ సర్వే ఘటనలో 12 మందికి రిమాండ్

దోమ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 40మందిపై కేసు నమోదు చేసి 12 మందిని రిమాండ్‌కు తరలించారు. సోమవారం గుండాల తండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు ఘర్షణకు పాల్పడిన విషయం విదితమే. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. ఆధారాలతో సహా పలువురిని గుర్తించిన పోలీసులు 12 మందిని కోర్టులో హాజరుపరచగా వారికి రిమాండ్ విధించిందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



వ్యవసాయ మార్కెట్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ధారూరు: వ్యవసాయ మార్కెట్‌లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని మంగళవారం ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఉపాధిహామీ పథకం నుంచి మంజూరైన రూ.30లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి వ్యవసాయ కార్యాలయం వరకు రూ.10లక్షలు, ఏఎంసీ కార్యాలయం కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు రూ.10లక్షలు, ఏఎంసీ దుకాణాల సముదాయం ఎదుట రూ.10లక్షలు కేటాయించారని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్లోళ్ల రాములు, ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాగా కుక్కింద గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులను పట్లోళ్ల రాములు ప్రారంభించారు.

కిడ్నాప్ కథ సుఖాంతం

రూ.60 వేలకు విక్రయించిన ముఠా

- ఎనిమిది మందిపై కేసు
- ఆరుగురికి రిమాండ్
- పరారీలో ఇద్దరు నిందితులు



అదృశ్యమైన బాలుడు ఉసేన్‌ను తల్లిగోరేబీ అందజేస్తున్న సీఐ నగేష్, ఎస్ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: చెత్త సేకరిస్తూ జీవనం సాగిస్తున్న సంచార జాతుల చెందిన వారు సులువుగా డబ్బు సంపాదించేదుకు ఓ బాలుడిని కిడ్నాప్ చేశారు. కేసును సవాల్‌గా స్వీకరించిన తాండూరు పోలీసులు ఎస్‌ఐ విఠల్‌రెడ్డితో పాటు ఐదు బృందాలుగా ఏర్పడి 24గంటలు గడువక ముందే ఛేదించారు. ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసి మంగళవారం ఆరుగురిని రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. గౌతాపూర్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ నగేశ్ ఘటన వివరాలు వెల్లడించారు.

ఆటోలో వచ్చి.. రూ.60వేలకు విక్రయం

తాండూరు పట్టణంలోని రైల్వే బ్రిడ్జి కింద ఉంటున్న సంచార జాతులకు చెందిన శంకర్, పద్మమ్మ, హన్మంత్, లక్ష్మి, సాయమ్మ, ఓ మైనర్ చిత్తుకాగితాలు, పాతసామగ్రి సేకరించి స్క్రాప్ దుకాణాల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్‌కు చెందిన సంచారజాతులకు చెందిన భాషా, గోరేబీ దంపతులతో పరిచయం ఉంది. వీరికి ఏడాది వయసున్న బాలుడు ఉసేన్ ఉన్నాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో బాలుడి కిడ్నాప్ చేయాలని పథకం వేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10గంటల సమయంలో తాండూరు నుంచి ఓ ఆటోలో గౌతాపూర్‌కు చేరుకుని మల్లికార్జున ఆలయం వద్ద పడుకున్న బాషా, గోరేబీల కుమారుడిని ఎత్తుకెళ్లారు. ఈ ముఠా పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన బుర్రకథలు చెబుతూ జీవనం సాగించే కృష్ణకు సోమవారం ఉదయం 11గంటలకు కృష్ణకు ఫోన్ చేసి కోకట్ ఓఆర్‌ఆర్ వద్దకు రమ్మని చెప్పి రూ.60వేలకు విక్రయించారు. ఈ సొమ్మును రూ.10వేల చొప్పున ఆరుగురు పంచుకున్నారు.

గౌతపూర్‌లోని మల్లికార్జున దేవాలయం వద్ద బాలుడు ఉసేన్‌ను కిడ్నాప్ చేసిన ఆరుగురిని పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. వారు రైల్వే బ్రిడ్జి కింద ఉంటారని తెలియడంతో స్టేషన్‌కు పిలిచి విచారించగా నేరం ఒప్పుకొన్నారు. బాలుడిని ఎత్తుకెళ్లిన ఆరుగురు నిందితులు కొన్ని రోజులుగా ఇంద్రానగర్‌కు చెందిన కృష్ణ, ఆయన మిత్రుడైన చెన్నప్ప(దివ్యాంగుడు)కు తమ వద్ద బాలుడు ఉన్నాడు కొనుగోలు చేయండని అడుగుతున్నారు. కృష్ణకు ఆరుగురు ఆడపిల్లలే ఉండడంతో బాలుడిని కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో సోమవారం కొనుగోలు చేసిన వెంటనే మర్పల్లి మండలం షాపూర్‌కు వెళ్తుండగా సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా కృష్ణను పట్టుకుని బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో శంకర్, పద్మమ్మ, సాయమ్మ, కృష్ణ, ఓ మైనర్, చెన్నప్పను రిమాండ్‌కు తరలించగా హన్మంత్, లక్ష్మి పరారీలో ఉన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ప్రతాప్, మహేశ్, దస్తప్ప, రవి, నర్సింలును సీఐ అభినందించారు.

నాగిరెడ్డిపల్లిని అభివృద్ధి చేద్దాం

కడా అధికారి వెంకట్‌రెడ్డి



పాఠశాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: 'బడి, గుడి సమానం.. మన ఊరిని అభివృద్ధి చేద్దాం.. అధికారులకు సమష్టిగా సహకరింకరించాలి'.. అంటూ కడా అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిని సందర్శించారు. గ్రామంలోని జాతీయ రహదారి–163కు ఆనుకుని ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. కాగా రహదారికి సమీపంగా ఉన్న పాఠశాలకు మరో చోట నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. ఈ మేరకు ఆయన వెంటనే మరో చోట పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని కమ్యూనిటీ హాలు స్థలంలో పాఠశాల భవనం నిర్మించాలని తీర్మానించారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని గ్రామస్తులకు తెలిపారు.

దేవాలయం పరిశీలన

గ్రామ శివారులోని గుట్టపై ఉన్న పార్వతి పరమేశ్వర దేవస్థానాన్ని పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి దేవస్థానం వరకు సీసీరోడ్డు, కల్యాణమండపం నిర్మించాలని గ్రామస్తులు, దేవాలయ కమిటీవారు విన్నవించారు. అందుకు స్థల పరిశీలన చేసి నిధులు మంజూరు చేస్తామని కడా అధికారి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు నర్సింలు, వెంకటయ్య, ఎల్లప్ప, బాబు, రాజు ఉన్నారు.

'పారిశ్రామిక వాడ'కు భూ సర్వే

పర్యవేక్షిస్తున్న కొడంగల్, దుద్యాల్ తాహసీల్దార్‌లు



పొలాల్లో సర్వే చేస్తున్న అధికారులు

దుద్యాల్: లగచర్ల ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఫార్మాసిటీకి బదులుగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంకల్పించింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాలలో ఏర్పాటు చేయదలిచిన పారిశ్రామిక వాడకు భూసేకరణ పనులు ముమ్మరం చేశారు. మంగళవారం మండల పరిధిలోని హకీంపేట్ గ్రామానికి చెందిన 351 ఎకరాలకు కొడంగల్ తహసీల్దార్ విజయ్ కుమార్, దుద్యాల్ తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. పట్టదారుడు వద్ద సర్వే నంబర్ ప్రకారం వారి భూమి మూలాలను గుర్తిస్తున్నారు. ప్రస్తుతం పట్టా పాసుపుస్తకంలో ఉన్న పొజిషన్‌లోనే ఉన్నారా లేదా అని సర్వే ఆధారంగా గుర్తిస్తున్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే సర్వేకు ముగ్గురు సర్వేయర్లకు ముగ్గురు ఆర్‌ఐలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్‌ఐలు నవీన్, రాఘవేందర్, వేణు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాకు యత్నం

అడ్డంగా మట్టి, రాళ్లు పోసిన ఆక్రమణదారులు

- చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసుల వినతి



కాలనీలకు వెళ్లే దారికి అడ్డంగా పోసిన మట్టి, రాళ్లు

అబ్దుల్లాపూర్‌మెట్: కాలనీలకు వెళ్లే ప్రధాన దారిని కబ్జా చేసేందుకు పలువురు వ్యక్తులు యత్నించిన ఘటన పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని 4వ వార్డులో మంగళవారం చోటు చేసుకుంది. కాలనీవాసుల వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలో బృందావన్‌హోటల్‌కు ఆనుకుని జాతీయ రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లేందుకు ఆయా లే అవుట్లు చేసిన సమయంలో (సర్వేనంబర్ 175) రోడ్డును వేశారు. దాదాపు 25 ఏళ్లు కావస్తున్నప్పటికీ ఇటీవల కొంతమంది ఆ రహదారిని కబ్జా చేసేందుకు యత్నించారు. రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించి, భారీ కంటైనర్‌ను ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ఆపిల్ ఎవెన్యూ కాలనీ అసోసియేషన్, వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటు చేసుకోగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో పోలీసులు, మున్సిపల్ అధికారులకు రెండు కాలనీల ప్రజలు ఆక్రమణదారులపై ఫిర్యాదు చేయగా అటు వైపు వెళ్లకూడదని హెచ్చరించారు. అయినా ఆక్రమణదారులు ఆగడాలను ఆపడం లేదు. మంగళవారం కాలనీల్లోంచి బయటకు వచ్చే మార్గంలో పెద్ద ఎత్తున మట్టి, రాళ్లను నింపడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ విషయంలో అధికారులు స్పందించి కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.